## చెట్టు కొమ్మల తొలగింపు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 26 : అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి ఆదేశాల మేరకు తుకారాంగేట్ పహాడి హనుమాన్ ఆలయం వద్ద, శాంతినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను సోమవారం అధికారులు తొలగించారు. రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్టుకొమ్మలను తొలగించినట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ తెలిపారు.

## ఫీజుల పేరుతో వేధించొద్దు: ఏబీవీపీ


జీవన్

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 26: రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు హాల్‌టికెట్ల జారీలో ఎటువంటి ఇబ్బందులు సృష్టించొద్దని ఏబీవీపీ స్టేట్ ఆల్ యూనివర్సిటీస్ ఇన్‌చార్జి జీవన్ విద్యాసంస్థల యాజమాన్యాలకు సూచించారు. పరీక్షల సమయంలో ఫీజుల పేరుతో వేధించకూడదని కోరారు. ఫీజుల పేరుతో మానసిక వేదనకు గురిచేస్తున్నా కనీస చర్యలు తీసుకోకుండా ఇంటర్ బోర్డు అధికార యంత్రాంగం చోద్యం చూస్తోందని మండిపడ్డారు. కార్పొరేట్ కళాశాలలు విద్యార్థుల నుంచి ఫీజు బకాయిలు, హాజరు పేరుతో ఫీజులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నా అది కాగితాలకే పరిమితమైందని పేర్కొన్నారు. కళాశాల యాజమాన్యం హాల్‌టికెట్ ఇచ్చేందుకు నిరాకరిస్తే ఆన్‌లైన్‌లో కూడా హాల్‌టికెట్లు తీసుకోవచ్చని, వాటిపై ప్రిన్సిపాల్ సంతకం కూడా ఉండాల్సిన అవసరం లేదని చెప్పారు.

# అలసత్వం ఎందుకు

## రూ.13 లక్షలు నిధులు విడుదలైనా..

- కార్పొరేటర్ సూచించినా పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు

బేగంపేట్, ఫిబ్రవరి 26: నిధులు ఉన్నాయి..పనుల్లో అలసత్వం కనిపిస్తోన్నది. అధికారుల నిర్లక్ష్యంతో స్థానికులు సమస్యలతో సతమతమవుతున్నారు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. వివరాలోకి వెళ్తే.. నాలుగు నెలల క్రితం అనగా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో బేగంపేట డివిజన్ ఓల్డ్ పాటిగడ్డ ప్రభుత్వ దవాఖాన సమీపంలో రోడ్డు వేసేందుకు రూ.13 లక్షలు మంజూరు చేశారు. అయితే ఆ పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నది. స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులకు సూచించినప్పటికీ పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. బేగంపేట్ సర్కిల్ పరిధిలోని బేగంపేట్, రాంగోపాల్‌పేట్, మోండా మార్కెట్, బన్సీలాల్‌పేట్ డివిజన్‌లలో ఆయా అభివృద్ధి పనులకు గాను గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరైనా.. అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుండటంతో పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. ఈ సమస్యను పలుమార్లు స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లగా వారు అధికారులకు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని వారు పేర్కొన్నారు. ఈ సమస్యను త్వరగా పరిష్కరించి అక్కడ డ్రైనేజీని సరిచేసి రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు.


ఓల్డ్ పాటిగడ్డలో రోడ్డు వేయాల్సిన ప్రదేశం


అక్కడే డ్రైనేజీ పొంగి దుర్గంధ భరితంగా మారిన ప్రదేశాలు

### త్వరలోనే రోడ్డు వేస్తాం
సుదర్శన్, బేగంపేట్ సర్కిల్ ఈఈ

రోడ్డు అభివృద్ధికి రూ. 13లక్షలు నిధులు మంజూరయ్యాయి. అక్కడ రోడ్డు వేసేందుకు కొంత వరకు చదును చేశాం. డ్రైనేజీ పొంగుతుండటంతో పనులు నిలిపివేశాం..డ్రైనేజీ పనులు చేపట్టాల్సిన విభాగానికి సమాచారం ఇచ్చాం. వారు పట్టించుకోవడం లేదు. వారు ఆ పనులు పూర్తి చేయగానే రోడ్డు వేస్తాం.

## దశల వారీగా సమస్యలు పరిష్కారం

**మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత**

అడ్డగుట్ట, ఫిబ్రవరి 26 : దశల వారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత అన్నారు. సోమవారం జలమండలి, జీహెచ్ఎమ్‌సీ అధికారులతో కలిసి డివిజన్ పరిధిలోని గోవిందపురంలో జరుగుతున్న సీవరేజ్ పైపులైన్ కనెక్షన్ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను కార్పొరేటర్ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆమె అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి, జీహెచ్ఎమ్‌సీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


గోవిందపురంలో సమస్యలు తెలుసుకుంటున్న మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత



**మహా చండీయాగం..:** అడ్డగుట్ట సీ సెక్షన్ కమ్యూనిటీ హాల్ సమీపంలో శ్రీ మార్కండేయ దేవాలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా యాగశాలలో సోమవారం మహాచండి యాగం, రుద్రహోమం, ప్రతిష్ఠ దేవతల హోమాలు నిర్వహించారు. ఈ హోమ కార్యక్రమాల్లో పద్మశాలి కుటుంబ సభ్యులు సంతోష్, రామకృష్ణ, యాదగిరి, మహేష్, రాజేశం దంపతులు సతీసమేతంగా పాల్గొని హోమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు శ్రీనివాస్, శ్రీ రాములు, వీరయ్య, ఎల్లయ్య, మహిళా అధ్యక్షురాలు గుంటక రూప, శారదతో పాటు తదితరులు పాల్గొన్నారు. – అడ్డగుట్ట, ఫిబ్రవరి 26 :

## డ్రైనేజీ సమస్య లేకుండా చూడాలి


స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 26: సీతాఫల్‌మండి డివిజన్‌లోని టీర్టీ క్వార్టర్స్, మధురానగర్ ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ సామల హేమ సోమవారం పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో సీవరేజీ లైన్ ఉప్పొంగుతోందని స్థానికులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన ఆమె సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ అన్విత్, బీఆర్ఎస్ నాయకులు కరాటే రాజు తదితరులు పాల్గొన్నారు.



### అలరించిన కిడ్స్ కార్నివాల్..

సన్‌షైన్ ప్రీ స్కూల్స్, డే కేర్ చిన్నారుల 'చిల్డ్రన్స్ డే అవుట్' పేరుతో నిర్వహించిన కిడ్స్ కార్నివాల్ అలరించింది. ఈ సందర్భంగా చిన్నారులు తమ ఆటపాటలతో పాటు సందేశాత్మక స్కిట్‌లు ఆహుతులను అబ్బురపరిచాయి. సేవ్ వాటర్ పేరుతో నిర్వహించిన స్కిట్‌లో రైతు కష్టాలు, భూ తాపాన్ని తగ్గించేలా పచ్చదనాన్ని పెంచడం వల్ల పర్యావరణ సమతుల్యతను కాపాడాల్సిన అవసరాన్ని చిన్నారులు చక్కగా ఎత్తి చూపారు.అపోలో ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ షర్మిల జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సన్‌షైన్ సంస్థ చైర్‌పర్సన్ సలోనివర్మ తదితరులు పాల్గొన్నారు. అమీర్‌పేట్



### వస్త్ర ప్రదర్శన

క్రాఫ్ట్స్ అండ్ వీవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతృత్వంలో వస్త్ర ప్రదర్శన ఆకర్శిస్తుందని వర్ధమాని నటి రూపాచౌదరి అన్నారు. శ్రీనగర్ కాలనీ సత్యసాయి నిగమాగమంలో గుజరాత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటైన జాతీయ చేనేత పట్టు ఉత్పత్తుల వస్త్ర ప్రదర్శనను రూపా చౌదరి సోమవారం ప్రారంభించారు. నిర్వాహకులు జయేష్ మాట్లాడుతూ.. మార్చి 3 వరకు ప్రదర్శన ఉంటుందని, 14 నగరాల నుంచి సిల్క్ హ్యాండ్లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్, 50 వేల రకాల వస్త్ర ఉత్పత్తులను అందుబాటులో ఉంచామన్నారు. – వెంగళరావునగర్, ఫిబ్రవరి 26

## మోదీది అవినీతి రహిత పాలన

**'విజయసంకల్ప యాత్ర'లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి**


పద్మారావునగర్‌లో 'విజయ సంకల్ప యాత్ర'ను ప్రారంభించిన జీ.కిషన్ రెడ్డి, డాక్టర్ కే.లక్ష్మణ్‌లు

బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 26 : కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వాన్ని తీసుకురావడానికి బీజేపీ నాయకులు కృషి చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం సనత్‌నగర్ నియోజకవర్గంలో 'బీజేపీ విజయ సంకల్ప యాత్ర' నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..ప్రధానమంత్రి నరేంద్రమోదీ గత పదేండ్లలో అవినీతి రహిత పాలన అందించారన్నారు.

అదేవిధంగా పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని కొనియాడారు. అంతకుముందు పద్మారావునగర్‌లోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద పార్టీ పతాకాన్ని ఎగురవేసిన అనంతరం బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జీ.కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే.లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు బి.శ్యామ్‌సుందర్ గౌడ్, ఉపాధ్యక్షుడు సారంగపాణి, టి.రాజశేఖర్‌రెడ్డిలు బస్సు యాత్రను ప్రారంభించారు.

పద్మారావునగర్ నుంచి మొదలై బన్సీలాల్ పేట్, రాణిగంజ్, మోండా మార్కెట్, సింధి కాలనీ, పాటిగడ్డ, బేగంపేట్, అమీర్‌పేట్, సనత్‌నగర్ వరకు కొనసాగింది. మోండా మార్కెట్‌లోని సోలాపూర్ స్వీట్ హౌస్, అమీర్‌పేట్‌లోని సత్యం థియేటర్ వద్ద నిర్వహించిన రెండు కార్నర్ మీటింగ్‌లలో నాయకులు ప్రసంగించారు.



### టేబుల్ టెన్నిస్ విజేతకు అభినందనలు

5వ హైదరాబాద్ వెటరన్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్-2024లో నిర్వహించిన పోటీల్లో గాంధీ దవాఖాన గైనకాలజీ విభాగం ప్రొఫెసర్ జీ.మహాలక్ష్మి విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా సోమవారం గాంధీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.రమేశ్‌రెడ్డి, గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. రాజారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.కృష్ణమోహన్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎ.వేణులు ఆమెను అభినందించారు.


బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 26 :

### సమస్యలు పరిష్కరించాలి

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 26: పేదల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని సీపీఐ గ్రేటర్ కార్యదర్శి ఎస్.ఛాయాదేవి ప్రభుత్వాధినేతలకు విజ్ఞప్తి చేశారు. హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో సోమవారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయకుండా ప్రభుత్వ రంగ సంస్థలను కనుమరుగు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. మురికి వాడల్లో పేదలకు మౌలిక సదుపాయాలను కల్పించి, ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించే సమయం ఆసన్నమైనదన్నారు.

### విద్యారంగానికి విద్యార్థులే కీలకం

కాచిగూడ: విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యత వారి ఉన్నత శిఖరాలకు దోహదపడుతుందని గానకోకిల మాళవిక ఆనంద్ అన్నారు. స్ట్రాబెర్రీస్ ఫీల్డ్ స్కూల్ వార్షికోత్సవాలు సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. మాళవిక ఆనంద్ బహుమతులు అందజేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ సవిత, విద్యార్థులు పాల్గొన్నారు.



### ఎస్సీఆర్పీఎస్ డైరీ, క్యాలెండర్ అందజేత

షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం, తెలంగాణ శాఖ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను సోమవారం గాంధీనగర్ డివిజన్ ఏసీపీ మొగిలయ్య, గాంధీనగర్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ రాజును సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.సుదర్శన్ బాబు కలిసి అందజేశారు. ఎస్సీల హక్కుల పరిరక్షణకు తమ సంఘం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. సంఘం నాయకులు కుర్మ మహేందర్, రాపాక అశోక్, దేశపాక గోవర్ధన్, ఎల్లం కుమార్‌లు పాల్గొన్నారు.– బన్సీలాల్‌పేట్

### ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు


ముషీరాబాద్: విద్యానగర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం మీడియాలో ఉద్యోగ అవకాశాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నిర్మాత జి.శరత్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారత్ రానున్న కొన్ని సంవత్సరాలలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలవబోతుందని, ఓటీటీ సినిమా అతి పెద్ద వేదికగా మారబోతుందన్నారు. విస్తరిస్తున్న మీడియా రంగంలో యువతకు అవకాశాలు రానున్నాయని, అందుకోసం పోటీకి అనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావాలని సూచించారు. కళాశాల చరిత్ర విభాగం అధ్యాపకుడు పి.వెంకట్ ఈశ్వర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.సుకన్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

## రాష్ట్రపతి నిలయంలో సైన్స్ డే వేడుకలు ప్రారంభం

బొల్లారం,ఫిబ్రవరి 26: బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో సైన్స్ డే వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ వేడుకల్లో భాగంగా మెదటి రోజు సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రాధాన్యతో పాటు క్విజ్ పోటీలు నిర్వహించారు.ఈ పోటీల్లో 31 పాఠశాలల,24 కళాశాలల నుంచి సుమారు 1100 మంది విద్యార్థులు సాంకేతికత ప్రదర్శన స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక నుంచి ప్రముఖ కళాకారుడు చంద్రయ్య ప్రదర్శించిన సైన్స్ మ్యూజిక్ షో అందరినీ అలరించింది. అదేవిధంగా 'మీట్ ది సైంటిస్ట్' కార్యక్రమంలో వివిధ ఆర్ అండ్ డీ సంస్థల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారని రాష్ట్రపతి నిలయ అధికారి రజినీ ప్రియ పేర్కొన్నారు.


బొల్లారం రాష్ట్రపతి నిలయంలో జ్యోతి ప్రజ్వలన చేసి సైన్స్ డే వేడుకలను ప్రారంభిస్తున్న రాష్ట్రపతి నిలయం అధికారులు

## చెత్త తరలింపులో నిర్లక్ష్యంపై ఫిర్యాదులు


శానిటేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 26: జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బంది నిర్లక్ష్యంపై ఇటీవల పౌరుల నుంచి ఫిర్యాదులు పెరిగాయని, చెత్త తరలింపులో అలసత్వం మానుకోవాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ సూచించారు. ఫిలింనగర్‌లోని తన కార్యాలయంలో జీహెచ్ఎంసీ సర్కిల్-18 ఏఎంవోహెచ్ డా.రజనీకాంత్, శానిటేషన్ సూపర్‌వైజర్లతో కార్పొరేటర్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రోడ్లను శుభ్రం చేయడం లేదని, రోడ్ల పక్కన గుట్టలుగా చెత్త పేరుకుపోతున్నా పట్టించుకోవడం లేదని కాలనీలు, బస్తీల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని కార్పొరేటర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్త తరలింపు వాహనాలు సరిపోయినన్ని లేవని, సిబ్బంది కొరత ఉందని శానిటేషన్ విభాగం అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని త్వరలో జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని అన్నారు. ఎస్ఎఫ్ఏల పనితీరుపై విజిలెన్స్ విభాగం నిఘా పెట్టిందని, పద్ధతి మార్చుకోకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు.

### 29న అమ్మవారి ధ్వజ స్తంభం పునఃప్రతిష్ఠ

అంబర్‌పేట, ఫిబ్రవరి 26 : అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో మహంకాళి అమ్మవారి దేవాలయంలో ఈ నెల 29న ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ ఉంటుందని సమితి ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా 27న విఘ్నేశ్వరపూజ, అఖండ దీపారాధన, అంకురారోపణము, యాగశాల ప్రవేశం, మండపారాధన, సాయంత్రం 5 గంటలకు అగ్నిప్రతిష్ఠ, జలాదివాసము, దేవతాహోమాలు, నీరాజనం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం ఉంటాయన్నారు. 28న మంటప పూజలు, మూలమంత్ర హోమా లు, జపాలు, ధాన్యాదివాసం, మంత్ర పుష్పం, 5 గంటలకు దేవతాహోమాలు, ప్రదోష కాల పూజలు, ధ్వజస్తంభానికి పుష్పాదివాసము, ఫలాదివాసము, శయ్యాదివాసము ఉంటాయని తెలిపారు. 29న ఉదయం 6 గంటలకు మంటప పూజలు 10 గంటలకు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, బలినివేద, పూర్ణాహుతి, కుంభాభిషేకం, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 26: గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...సఫిల్‌గూడ -రామకృష్ణ పురం రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి సోమవారం ఉదయం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని...పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### ల్యాప్‌టాప్ మాయం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 26: హాస్టల్ గదిలో నుంచి ల్యాప్‌టాప్ మాయమైన ఘటన ఫిలింనగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఎమ్మెల్యే కాలనీ లోటస్ పాండ్ సమీపంలో కైగో హాస్టల్‌లో నివాసం ఉండే తరుణ్ పాండే ప్రైవేటు ఉద్యోగి. ఈ నెల 24న హాస్టల్ నుంచి బయటకు వెళ్లే క్రమంలో ల్యాప్‌టాప్‌ను బ్యాగులో పెట్టి వెళ్లాడు. రెండు గంటల తర్వాత వచ్చి చూడగా ల్యాప్‌టాప్ కనిపించలేదు. హాస్టల్‌లోని వ్యక్తులను అడిగినా ప్రయోజనం లేకపోవడంతో సోమవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

## ఇందిరా పార్కు అభివృద్ధికి కృషి

- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్
- వాకర్స్ సమస్యలపై ఆరా

కవాడిగూడ, ఫిబ్రవరి 26: ఇందిరాపార్కును రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఇందిరాపార్కులో పార్కు డైరెక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ డైరెక్టర్ రాజ్‌కుమార్, పార్కు మేనేజర్ భాస్కర్, సూపర్‌వైజర్ మౌనికతో పాటు బీజేపీ నాయకులు జి.వెంకటేశ్‌లతో కలిసి ఆయన సందర్శించి పార్కులోని సందర్శకులు, వాకర్స్‌ను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందిరాపార్కులో కనీస సౌకర్యాల కల్పనకు పార్కులో ఉన్న వివిధ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలలో వాకర్స్, స్థానికులు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఇందిరాపార్కులో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి వాకర్స్, సందర్శకులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. పార్కులో కుక్కల బెడద, నీటి సమస్యలు, శానిటేషన్, టాయిలెట్‌ల శుభ్రతపై అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందిరాపార్కు వాకర్స్ డాక్టర్ ఎ. సుధాకర్‌యాదవ్, ప్రభాకర్‌యాదవ్, శ్రీనివాస్‌ముదిరాజ్, టీకేఎం రెడ్డి, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

### కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

చిక్కడపల్లి : ఆడపిల్లలు తల్లిదండ్రులకు భారం కావద్దని మాజీ సీఎం కేసీఆర్ కల్యాణ లక్ష్మి పథకం తీసుకొచ్చి అమలు చేశారని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని హిమాయత్‌నగర్ తాసీల్దార్ కార్యాలయంలో సోమవారం గాంధీనగర్, రాంనగర్, కవాడిగూడ డివిజన్లకు చెందిన 51 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా గత బీఆర్ఎస్ ప్రభు త్వం పాలన కొనసాగిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ యువజన నాయకుడు ముఠా జయసింహ, డిప్యూటీ తాసీల్దార్ రఘువిష్ణు, కవాగూడ డివిజన్ కార్పొరేటర్ రచన శ్రీ, బీఆర్ఎస్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, రాకేశ్‌కుమార్, శంకర్ ముదిరాజ్, ఆర్. మోజస్, టెంపుల్ జనార్దన్, ప్రవీణ్, కల్యాణ్‌నాయక్, దేవేందర్ నాయక్, ఎస్టీ ప్రేమ్, తదితరులు పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**

The General public is hereby informed that my client Rachakatla Sarangapani S/o Rachakatla Mysaiah, Occupation Business, R/o H .No. 12-11-914/1, warasiguda Secunderabad Sithaphalmandi, 500061. My client is occupied as Tenant for the premises of House bearing No 12-11-920 ( 12-10-608/32), admeasuring 136 .00 Sq yards., situated at Warasiguda, Sithaphalmandi, Secunderabad since 40 years. The said premises is known as SARAGAPANI KITES SHOP it very famous in Warasiguda. And the owner of the premises promised to sell the said premises to my client. I hereby direct the general public to that not make any agreements in respect of the above said premises as my client is intending to claiming rights legally. If anybody makes any claims or Transactions in respect of the above said premises, will stands void and not valid.

Sd/- **KOMMU NAVEEN KUMAR**
Advocate,
Mettuguda, Secunderabad, 500017. **Cell: 7013766148**
Email: naveenkumar_kommu@yahoo.com
Date: 26-02-2024